క్లుప్తంగా

ఆర్థిక లావాదేవీలే పురోగతికి మార్గం



మాట్లాడుతున్న ఏపీఎం సర్వోత్తమరెడ్డి

చౌడేపల్లె: స్వయం సహాయక సంఘంలోని సభ్యుల ఆర్థిక లావాదేవీల నిర్వహణే ఆ సంఘం అభివృద్ధికి మార్గమని వెలుగు ఏపీఎం సర్వోత్తమరెడ్డి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో చౌడేపల్లె-4 గ్రామ సమాఖ్య సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామ సంఘంలో 28 మహిళా సంఘాలున్నాయని, ఈ ఏడాది రూ.2 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆర్థిక ప్రగతి సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ గ్రామ సంఘానికి రూ.79 వేల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. అనంతరం గ్రామ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో సీసీ మునిరత్నం పాల్గొన్నారు.

6న ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు

సదుం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్లు పశువైద్యశాల డాక్టర్ సుబ్రమణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. సదుం, చెరుకువారిపల్లె పశు వైద్యశాలల్లో ఈ టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. అలాగే జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పిస్తామని తెలియజేశారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి



స్కూల్ బంద్ చేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పలమనేరు: నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు నీట్ పరీక్షను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు షేక్‌బాబు, సంజిత్ బాలాజీ డిమాండ్ చేశారు. అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం పట్టణంలో కళాశాలలు, పాఠశాలల బంద్ విజయవంతమైంది. వారు మాట్లాడుతూ నీట్‌ను నిర్వహించే ఎన్‌టీఏను రద్దు చేయాల్సిన అవసరం ఈ లీకేజీ బాగోతంతో బైటపడిందన్నారు. ఇదో పెద్ద స్కామ్ అని, దీనిపై విచారణ చేయాలన్నారు. కష్టపడి పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా అంధకారంలోకి వెళుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

గుడుపల్లె: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయం మండలంలోని కనమనపల్లె నుంచి కుప్పానికి ఇసుకతో వెళ్తున్న ట్రాక్టరును స్టేషన్ వద్ద సీజ్ చేసి నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు తప్పవని, అలాగే మండలంలో ఎక్కడైనా మట్టితో తయారు చేసిన ఇసుకను తరలించినా చర్యలు తీసుకుంటామన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న బాబురెడ్డి

పెద్దపంజాణి: మండలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు బాబురెడ్డి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ గోపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పుంగనూరు డివిజన్ కన్వీనర్ నారాయణస్వామి, జిల్లా నాయకులు అంజాద్ ఆలీఖాన్, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, హరిప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

సదుం: స్థానిక వాల్మీకి వీధికి చెందిన రవికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి టీడీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, జనసేన, టీడీపీ నాయకులతో కలిసి రూ. 33 వేల ఆర్థిక సాయం అందజేశారు.

పలమనేరు: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కౌన్సిల్, అధికారులు.



పుంగనూరు: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భక్తవత్సలరాజు



యువతకు అల్లూరి స్ఫూర్తి

పలమనేరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత దేశభక్తితో ముందుకు పోవాలని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో కలసి ఆమె సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సమరంలో ఆయన చూపి ధైర్యసాహసాలు, పోరాటం బ్రిటీషర్లకు కంటికి కునుకులేకుండా చేసిందన్నారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వహించింది. అల్లూరి గురించి తులసీనాథం నాయుడు మాట్లాడారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రవి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీసుధా, కౌన్సిలర్లు కోదండరామయ్య, రహీంఖాన్, శ్యామ్, నాగరాజు, నయాజ్, హైదర్, ఫతాజ్, హేమంత్, రమేష్‌రెడ్డి, రాజేష్, కళామందిరంలో పుష్ప, కుమారి, సుశీలమ్మ పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: బ్రిటీషర్ల పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించాలని పోరాటం చేసి అమరుడైన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సేవలు మరువలేనివని క్షత్రియ సంఘం అధ్యక్షుడు భక్తవత్సలరాజు స్మరించారు. గురువారం పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. అలాగే శుభారాం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సోమరాజు, శ్రీని వాస్, క్షత్రియ సంఘ నాయకులు సుబ్రమణ్యంరాజు, రెడ్డెప్పరాజు, సీతాపతిరాజు, సతీష్‌కుమార్ రాజు, నారాయణరాజు, బీజేపీ నాయకులు నరసింహులు, త్రిమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు: కళామందిరంలో అల్లూరి జయంతి వేడుకలు

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో గురువారం అల్లూరి సీతారామ రాజు జయంతిని హెచ్‌ఎం బాబు రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. మన్యం వీరుడు ఓ విప్లవ కెరటం, తరతరాలకు స్ఫూర్తి అని స్మరించారు. ఆరవ తరగతి విద్యార్థి అల్లూరి సీతారామరాజు వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, మాధవన్, రాజేష్ బాబు, ఆంజప్ప తదితరులు పాల్గొన్నారు.



పెద్దపంజాణి: నాగిరెడ్డిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో..

కోరం లేక మండల సమావేశం వాయిదా

రొంపిచెర్ల: కోరం లేక రొంపిచెర్ల మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం వాయిదా పడింది. సర్వ సభ్య సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో సమావేశం నిర్వహించలేదు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి తదుపరి మళ్లీ మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించే విషయాన్ని తెలియజేస్తామని ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి తెలియజేశారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

పుంగనూరు: పట్టణంలోని ఆర్టీసి డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎం గంగన్న తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు సమస్యలపై ఫిర్యాదులు, సూచనలు-సలహాలు సెల్ నంబరు 9100941850కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

7న ముత్యాలమ్మ జాతర



ముత్యాలమ్మ

రొంపిచెర్ల: ఈ నెల 7న రొంపిచెర్లలో ముత్యాలమ్మ జాతర నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు గుణశేఖర్ గురువారం తెలిపారు. ఆ రోజు తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి పసుపు బిందెలతో అభిషేకం, మహా అభిషేకం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు



గ్యాస్ ఆఫీస్ వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు

- మూడు ఉచిత సిలిండర్ల కోసమేనని ప్రచారం!
- కాదంటున్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు

వి.కోట: ప్రస్తుత ప్రభుత్వం మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడానికి ఈకేవైసీ చేసుకోవాలని ప్రచారంలోకి రావడంతో స్థానిక ఇండేన్ గ్యాస్ ఆఫీసు వద్ద ఈకేవైసీ కోసం నిత్యం వందలాది మంది మహిళలు పడిగాపులు కాస్తున్నారు. ఈ తంతు 10 రోజులుగా నడుస్తోంది. ఈ కేవైసీ చేసుకోకపోతే ప్రభుత్వం ఇస్తామన్న 3 సిలిండర్లు ఉచితంగా ఇవ్వరేమోననే ఉద్దేశంతో వందల సంఖ్యలో మహిళలు గ్యాస్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు.. ఇలా పెద్ద సంఖ్యలో ఒక్కసారిగా మహిళలు సర్వర్ కూడా పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని ఏజెన్సీ నిర్వాహకులు చెప్పారు. వినియోగదారులు ఎంతమంది ఉన్నారు? లబ్ధిదారులు కాకుండా మరెవరైనా గ్యాస్ పుస్తకాలతో సిలిండర్లు వినియోగిస్తున్నారా? అనే వివరాల కోసం మాత్రమే తాము ఈకేవైసీ చేస్తున్నట్లు చెప్పారు. సిలిండర్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేసుకోవడం మంచిదేనన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

పలమనేరు: పట్టణానికి చెందిన వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ చీఫ్ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను పాదరక్షలతో కొట్టి, ఆపై దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంటులో రాహుల్‌గాంధీ హిందూ దేవుళ్ల చిత్రపటాలను చూపుతూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. హిందూ దేవుళ్లను తక్కువచేసి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదన్నారు. ఈ నిరసన కార్యక్రమం సిద్ధయ్య, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్‌బాబు

గంగవరం: మండలంలోని కొత్తపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్ బాబు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి వెంకట ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పీహెచ్‌సీ స్థాయిలో ఇప్పటి వరకూ 50 శాతం పైగా వ్యాక్సిన్ వేసినట్టు తెలుసుకున్నారు. గ్రామాల్లో బీసీసీ వ్యాక్సిన్ అవసరమైన ప్రజలను గుర్తించి తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. దీనిని అందరూ బాధ్యతగా తీసుకుని మండలం వ్యాప్తంగా వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మ హుండీ లెక్కింపు

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమానిగంగమ్మ ఆలయ హుండీని గురువారం ఈఓ తిమ్మరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. ఈఓ మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి 2024 మార్చి నెల నుంచి ప్రస్తుతం వరకు అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.2 లక్షల 24,808 నగదు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీ ఆదాయాన్ని బ్యాంక్‌లో జమచేశామన్నారు. ఆలయ చైర్మన్ లింగారెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం



సమావేశమైన వైఎస్సార్ సీపీ నాయకులు

పలమనేరు: ఈనెల 8న వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జాఫర్ కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాల మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించరూ



సీఈఓ గ్లోరియాకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఎఫ్ సమస్యలను పరిష్కారించాలని జెడ్పీ సీఈఓ గ్లోరియాను ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు వినతి చేశారు. గురువారం జెడ్పీ సీఈఓ కార్యాలయంలో ఆమెను కలిసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వార్షిక పీఎఫ్ స్లిప్‌లను వడ్డీ సహా లెక్కించి విడుదల చేయాలన్నారు. మిస్సింగ్ క్రెడిట్స్ ఏవైనా ఉంటే మండలాలకు సమాచారం అందించి షెడ్యూల్స్‌ను తెప్పించుకుని సరిచేయాలన్నారు. సకాలంలో రికవరీ, నాన్ రికవరీ లోను ఫైనల్ పేమెంట్ వాటిని సకాలంలో విడుదల చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచి నెలలోపు పీఎఫ్ ఖాతాదారులకు ఆ మొత్తంను చెల్లించే విధంగా కృషి చేయాలని తెలిపారు. మిస్సింగ్ క్రెడిట్స్ కోసం ఈనెలలో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు.

పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకోండి



షికారిపాళ్యంలో కూలీలతో మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ రవికుమార్

చౌడేపల్లె: ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకం పనులు చేసేందుకు ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని డ్వామా ఏపీడీ రవికుమార్ కోరారు. గురువారం దిగువపల్లె పంచాయతీ షికారిపాళ్యంను ఆయన సందర్శించారు. కూలీలతో మాట్లాడారు. ఉపాధి పథకం కింద సన్న చిన్నకారు రైతులకు మామిడితోపాటు జామ, ఉసిరి, కొబ్బరి, సపోటా, నేరుడు, సీతాఫలంతోపాటు 13 రకాల పండ్లతోటలను పెంచుకునే సదుపాయం ఉందన్నారు. పండ్లతోటల పెంపకందారులకు మూడేళ్ల పాటు ఆర్థిక సదుపాయం కల్పిస్తారన్నారు. దరఖాస్తులను ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేయాలని కోరారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని చెరువులు, కుంట్లకు వర్షపు నీరు వచ్చే కాలువలను గుర్తించి పూడికతీత పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు చేసుకోదలచిన భూ అభివృద్ధి పనులను వివరించారు. కూలీలకు ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించి పంచాయతీ వారీగా కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. రోజుకు గరిష్ఠంగా రూ.300 చొప్పున వేతనం పొందే అవకాశం ఉందన్నారు. దీనిని జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సోని, ఏపీఓ శ్రీనివాస్ యాదవ్, జేఈ ధనుంజయుడు, టీఏ అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని అన్నదానం ట్రస్టుకు గురువారం గుంటూరుకు చెందిన ప్రత్యూష కుటుంబం రూ.1,00,116లు విరాళంగా ఇచ్చారు. ఆ నగదును చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వారికి అధికారులు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



చెక్కు అందజేస్తున్న దాత

మొండి.. పాతబండి!

- పాత వాహనాలు విక్రయిస్తే జాగ్రత్తలు తప్పనిసరి
- కొన్నవారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించండి
- లేదంటే తిప్పలు తప్పవంటున్న ఆర్టీఏ అధికారులు



ద్విచక్రవాహనాలు

కాణిపాకం: కొత్త వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అదే స్థాయిలో పాత వాహనాల విక్రయాలు కూడా జరుగుతున్నాయి. అయితే పాత వాహనాలను విక్రయించిన వారు కొనుగోలు చేసిన వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం తప్పనిసరి. తెలిసిన వాళ్లనో, మరే కారణంతోనే రిజిస్ట్రేషన్ చేయించడం నిర్లక్ష్యం చేస్తే ఆ తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుందని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు పరిధిలో 1.70 లక్షల జనాభా ఉండగా.. ప్రతి ఇంట్లో కనీసం రెండు వాహనాలు వాడుతూ ఉంటారు. ఈ లెక్కన ఎంత లేదన్నా సరాసరి 75 వేల వాహనాలు ఉండొచ్చని ఆర్టీఏ అధికారుల అంచనా.

మార్పు తప్పనిసరి

పట్టణాలతో పాటు ఇటీవల మండలాల స్థాయిలో పాత వాహనాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వాహనం అమ్మిన వెంటనే వాహనదారుడు కొనుగోలుదారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలి. లేకుంటే పోలీసుల చేత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొనుగోలుదారుడు ఎక్కడైనా వాహనాన్ని యాక్సిడెంట్ చేసినా, అక్రమ మద్యం తరలిస్తున్నా, మైనర్‌కు వాహనం ఇచ్చి నడిపించినా, ఆ సమయంలో ప్రమాదం జరిగినా, రాంగ్ డ్రైవింగ్ చేసినా, నోపార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసినా విక్రయదారుడిపై కేసులు నమోదు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక వాహనం పాత యజమాని వద్ద ఉన్నప్పుడు చేసిన నేరాల అంశాలకు కొత్త యజమానికి తిప్పలు తప్పవు. కోర్టుల చుట్టూ తిరిగి అనవసరమైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తుంది. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఆలస్యమైతే కనీసం సేల్‌డీడ్ అయినా రాయించుకోవాలి.

జోరుగా బేరాలు..

పట్టణాలతో పాటు ఇటీవల మండలాల స్థాయిలో పాత వాహనాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మధ్యవర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. వాహనం కొనుగోలుదారుడు వాహనంపై పెండింగ్ కేసులు, చలానాలు ఉన్నాయో లేదో చూసుకోకుండా కొనుగోలు చేయడం వల్ల తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఒక్కోసారి పాత కేసులుగానీ, చలానా గానీ తానే భరించాల్సి వస్తుంది.

29, 30 ఫారాలే ముఖ్యం..

వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేసుకోవడం ముఖ్యమని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. వాటితో పాటు ఫారం-29 రెండు కాపీలు, ఫారం-30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాత వాహనాలు అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరోవాహనం కొన్నప్పుడు అదనపు ఇబ్బందులు, ట్యాక్సు ఎదురు కావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో పలువురు ఎక్కువ పన్ను చెల్లిస్తూనే ఉన్నారు. ఇకనైనా వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరువైపులా యాజమాన్య హక్కులను స్పష్టంగా మార్చుకోవాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు.

కొనుగోలుదారుడి పేరుపై రిజిస్ట్రేషన్ తప్పనిసరి



పాతవాహనాలు అమ్మిన వెంటనే కొనుగోలుదారుడిపై రిజిస్ట్రేషన్ చేయించాలి. లేదంటే కొనుగోలుదారుడు వాహనాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ పనులు చేపడితే అమ్మిన వాహనదారుడిపైనే కేసులు నమోదవుతాయి. పాత వాహనాలు కొన్న వెంటనే ఫారం-29, 30 విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. తప్పనిసరిగా ఇరువైపులా యాజమాన్యులు జాగ్రత్తలు పాటించాలి. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవు.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు